ఆలయ పునరుద్ధరణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తా

ఆలయ పురోగతిపై కేసీఆర్‌కు వివరిస్తున్న ట్రస్టీ సభ్యులు

మర్కూక్,మార్చి18: వారం రోజుల్లో తానే స్వయంగా వచ్చి ఆలయ పునరుద్ధరణ పనులను పర్యవేక్షిస్తానని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. మంగళవారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్‌ను వరదరాజులస్వామి ఆలయట్రస్టీ సభ్యులతో కలిసి చైర్మన్ గోపాలకృష్ణ కలిశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హయాంలో వరదరాజుల స్వామి ఆలయ పునరుద్ధరణలో భాగంగా మంజూరైన నిధులు, ఆగిపోయిన పనులను కేసీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వంతో మాట్లాడి త్వరగా పనులు పనులు పూర్తిచేయించడమేకాకుండా,వారంరోజుల తర్వాత ఆలయపురోగతిని పరిశీలిస్తానని తెలిపారు. ఆలయ పూజారి వరుణాచార్యులు, బీఆర్ఎస్ నాయకులు లక్కాకుల నరేశ్, ప్రవీణ్, తుమ్మకృష్ణ, అంతని నర్సింహులు, దేవేందర్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షకు సంఘీభావం

ఎమ్మార్పీఎస్ నిరసన దీక్షకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే రసమయి

బెజ్జంకి, మార్చి 18: ఎస్సీ వర్గీకరణకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించక గ్రూప్స్ పరీక్ష ఫలితాలు విడుదల చేయడంతో ఎస్సీ ఉపకులాలకు అన్యాయం జరిగిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసన దీక్షకు మంగళవారం ఆయన సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించకుండా కాలయాపన చేస్తుందని మండిపడ్డారు. నాయకులు లింగాల లక్ష్మణ్, నరేశ్, పరశురాములు, బాబు, భూమయ్య పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలం

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, మార్చి 18: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి, ఎడ్ల సోమిరెడ్డి, ఎల్లారెడ్డి, కౌన్సిలర్ ఆర విందర్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం సిద్దిపేటలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ మహిళలను కోటీశ్వరులను చేస్తానని చెప్పి కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని విమర్శించారు. ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఆరు గ్యారెంటీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైందన్నారు. గెలుపుపై నమ్మకం లేక స్థానిక సంస్థల ఎన్నికలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి పాలన కొనసాగించాలని హితవు పలికారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్‌గౌడ్, ఆంజనేయులు, సయ్యద్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

మల్లన్న ఆదాయం రూ.68,46,587

చేర్యాల, మార్చి 18: కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొమ్మిదో ఆదివారం ఆర్జిత సేవల ద్వారా రూ. 68,46,587ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో శనివారం రూ.14,28,446, ఆదివారం రూ.48,13,753, సోమవారం రూ. 6,04,388 ఆదాయం వచ్చిందన్నారు. ఆయనతో ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్, ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, సిబ్బంది, ఒగ్గు పూజారులు ఉన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

చేర్యాల, మార్చి 18: గ్రామాలు, శివారు ప్రాంతాల నుంచి పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన 400 కేవీ విద్యుత్ లైన్ల (పెద్ద టవర్లు) కింద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ జేఏ సురేశ్ కోరారు. మంగళవారం మండలంలోని ఆకునూరు తదితర గ్రామాల గుండా వెళ్తున్న టవర్ లైన్ల కింద ఉన్న చెట్లు తదితర వాటిని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఉద్యోగులు, సిబ్బంది పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ లైన్లలో అంతరాయం రావడం వల్ల వందలాది గ్రామాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోతున్నట్లు తెలిపారు. టవర్ల కింద ఉన్న పొలాలు, చెలకలలో చెత్తను తగలబెట్టినప్పుడు పొగపైకి ఎగిసి టవర్ లైన్లు ట్రిప్పు అవుతాయన్నారు. దీంతో కరెంట్ సరఫరా నిలిచిపోవడమే కాకుండా సిస్టమ్‌లో ఇబ్బంది కలుగుతుందన్నారు. చెత్తను టవర్ లైన్లకు దూరంగా తగలబెట్టుకుంటే తమకు అభ్యంతరం లేదన్నారు. ప్రజలు తమ సూచనలు పాటించి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందజేత

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 18: మద్దూరు మండలంలోని రేబర్తిలో గ్రామపంచాయతీ కార్యదర్శి మాధవ్‌జాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాధవ్‌జాదవ్ మాట్లాడుతూ వేసవిలో ఎండ తీవ్రతబాగా ఉన్న దృష్ట్యా వడదెబ్బ తగలకుండా కూలీలు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పని ప్రదేశంలో నీడ కల్పించాలన్నారు. కూలీలు ఉదయం పనులు ముగించుకొని ఎండ రాక ముందే ఇండ్లకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఐలయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పోలీసుల చేయూత

అనాథలుగా మారిన పిల్లలతో మాట్లాడుతున్న సీఐ లతీఫ్

తొగుట, మార్చి 18: మండలంలోని ఎల్లారెడ్డిపేట గ్రామంలో ఇటీవల కెమ్మసారం భాగ్యలక్ష్మీ నాగరాజు దంపతులు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన నలుగురు పిల్లలను మంగళవారం తొగుట సీఐ లతీఫ్, ఎస్సై రవికాంతారావు పరామర్శించి ఓదార్చారు. చిన్నారులకు రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

సరుకులు అందజేత

అనాథలైన చిన్నారులకు అక్కెపూడి రఘుట్రస్ట్ ఆధ్వర్యంలో సరుకులు అందజేశారు. బాలల సంరక్షణ విభాగం కౌన్సిలర్ నర్సింహులు, మాజీ ఎంపీటీసీ స్వామి,ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు రాణి, కళావతి, ప్రవీణ, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ ప్రజల ఆత్మీయుడు బొమ్మ వెంకన్న

బొమ్మ వెంకన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆకుల రజిత

హుస్నాబాద్‌టౌన్, మార్చి 18: హుస్నాబాద్ ప్రజల ఆత్మీయుడు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ బొమ్మ వెంకన్న అని మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజితావెంకన్న కొనియాడారు. మంగళవారం బొమ్మ వెంకన్న ఆరోవర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలోని నాగారం రోడ్డులోని బొమ్మ వెంకన్న విగ్రహానికి ఆమె పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సొసైటీ చైర్మన్ శివయ్య, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేత

చిన్నకోడూరు, మార్చి 18: మండలంలోని పెద్దకోడూరు జిల్లా పరిషత్ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు బట్టు ఎల్లేశ్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెన్త్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ప్రధానోపాధ్యాయులు యాదవరెడ్డి, ఉపాధ్యాయులు ముత్తి మహేశ్, పంజల రంజిత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అన్ని సీట్లు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ మనుచౌదరి
- తెలంగాణ గురుకుల మైనార్టీ బాలుర పాఠశాల సందర్శన

విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట, మార్చి 18: మైనార్టీ గురుకుల పాఠశాలలో ఖాళీలు లేకుండా అన్ని సీట్లు భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ మనుచౌదరి సూచించారు. మంగళవారం సిద్దిపేటలోని తెలంగాణ గురుకుల మైనార్టీ బాలుర పాఠశాలను ఆయన సందర్శించారు. 70శాతం మైనార్టీలకు, 25శాతం సీట్లు ఇతరులకు కేటాయిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కలెక్టర్‌కు వివరించారు. పాఠశాలలో మొత్తం 287 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలో సగానిపైగా సీట్లు ఖాళీగా ఉన్నాయని అసహనం వ్యక్తం చేశారు. ఇతర గురుకుల పాఠశాలలో సీట్లు దొరక చాలామంది విద్యార్థులు వేచి ఉన్నారని, ఈ పాఠశాలలో మాత్రం ఖాళీలు ఉన్నాయన్నారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. త్వరలో పరీక్షలు రాయనున్న నేపథ్యంలో విద్యార్థులు కఠినమైన సబ్జెక్టులను ఎక్కువసార్లు ప్రాక్టీస్ చేయాలని ఆయన సూచించారు. టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించి తల్లిదండ్రులు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. డార్మెంటరీలో ఫ్యాన్ల ఏర్పాటు, క్రీడా వస్తువులు ఇతర సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి కలెక్టర్ క్యూలో నిలబడి భోజనం చేశారు. మెనూ తప్పకుండా పాటించాలని, రుచికరమైన భోజనం అందించాలని ఆయన సిబ్బందికి సూచించారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న గరిమాఅగర్వాల్

సిద్దిపేట, మార్చి 18: ఎల్ఆర్ఎస్ రుసుంపై 25 శాతం తగ్గింపు రాయితీని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ గరిమాఅగర్వాల్ సూచించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ఆఫీసర్లు, ఆర్పీలతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ రుసుంపై 25శాతం రాయితీ ప్రకటించిందన్నారు. 2020లో ఎల్ఆర్ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ఈనెల 31వతేదీలోగా రాయితీని సద్వినియోగం చేసుకొని పూర్తి ఫీజు చెల్లించాలన్నారు. ఏదైనా సందేహాలుంటే హెల్ప్‌లైన్ సెల్ నెంబర్ : 9505507248ని సంప్రదించాలని ఆమె సూచించారు.

టెన్త్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

మాట్లాడుతున్న డీఈవో శ్రీనివాస్‌రెడ్డి

సిద్దిపేట అర్బన్, మార్చి 18: ఈనెల 21వ తేదీ నుంచి జరిగే టెన్త్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని మండల విద్యాధికారి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. టెన్త్ పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 79 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 14,124 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని, ఇందులో 7,124 మంది బాలురు, ఏడువేల మంది బాలికలు హాజరు కానున్నట్లు తెలిపారు. 14 మంది ప్రైవేట్ విద్యార్థులు, 1,763 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరు కానున్నారని, పరీక్షల నిర్వహణ సజావుగా సాగేందుకు 79 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 79 డిపార్ట్‌మెంటల్ అధికారులు, నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, ఏడు గురు రూట్ అధికారులు విధులు నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులు నిర్దేశిత సమయం కంటే అరగంటే ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో జిల్లా పరీక్షల అధికారి లక్ష్మయ్య, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దుబ్బాక, మార్చి18: పదిలో ఉత్తమ ఫలితాలు సాధించాలని మండల విద్యాధికారి ప్రభుదాస్ విద్యార్థులకు సూచించారు. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి ప్రభుత్వ పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈవో ప్రభుదాస్ మాట్లాడుతూ... టెన్త్ పరీక్షలు సమీపిస్తున్నందున ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు.

బూరుగుపల్లిలో...

గజ్వేల్, మార్చి 18: పదో తరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని డీఈవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మంగళవారం మండలంలోని బూరుగుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్ ల్యాబ్‌ను ప్రారంభించిన అనంతరం పదోతరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మల్లన్నసాగర్ ప్రాజెక్టు గురించి వివరిస్తున్న డీఈఈ శ్రీనివాస్

మల్లన్నసాగర్ అద్భుతం

సిద్దిపేట టౌన్, మార్చి 18: మల్లన్నసాగర్ హైడ్రో పవర్ ప్లాంట్ అద్భుతమని సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు కొనియాడారు. మల్లన్నసాగర్ జలవిద్యుత్ కేంద్రాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా హైడ్రో పవర్ ప్లాంట్ డీఈఈ చెన్ను శ్రీనివాస్ జలవిద్యుత్ తయారీ, టన్నెల్ నిర్మాణం, వాటర్ లిఫ్ట్‌సిస్టమ్, మోటార్ సామర్థ్యం, శక్తిపరివర్తన తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కృష్ణయ్య, పరిశోధన విద్యార్థులు శివానీ,కీర్తన, కార్తిక్, వెన్నెల, మానస, బీరప్ప, పూజిత, సార్థక్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యతో మార్పు

మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట టౌన్, మార్చి 18: గుణాత్మక విద్యతో మార్పు తథ్యమని కలెక్టర్ మనుచౌదరి అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్యశాస్త్రం విభాగాధిపతి గోపాల సుదర్శనం రచించిన ఆర్థిక అక్షరాస్యత పుస్తకాన్ని మంగళవారం కళాశాల సమావేశ మందిరంలో కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, అధ్యాపకులు అయోధ్యరెడ్డి, మధుసూదన్, మామిడాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎండిన పంటలకు పరిహారం ఇవ్వాలి

మాట్లాడుతున్న దేవీ రవీందర్

గజ్వేల్, మార్చి 18: ఎండిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిహారం అందించాలని రైతు బంధు సమితి రాష్ట్ర కౌన్సిల్ మాజీ సభ్యుడు దేవీరవీందర్ డిమాండ్ చేశారు. మంగళవారం బీఆర్ఎస్ గజ్వేల్, మర్కూక్ మండలాల అధ్యక్షులు బెండే మధు, మర్కూక్ కరుణాకర్‌రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి వరి సాగు చేసిన రైతుల పంటలు ఎండిపోతున్నాయన్నారు. నీళ్లులేక నష్టపోయిన వారికి ఎకరానికి రూ.15వేల చొప్పున నష్ట పరిహారాన్ని అందజేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముందుచూపు లేక చెరువులు, కుంటలు నింపకపోవడంతో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ఎద్దు ఎడ్చిన ఎవుసం, రైతు ఏడ్చిన రాజ్యం చరిత్రలోబాగుపడదు కనుక రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఎరువులు అందుబాటులో ఉంచాలి

పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన రాధిక

చిన్నకోడూరు, మార్చి 18: మండలంలోని పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని జిల్లా వ్యవసాయాధికారి రాధిక మంగళవారం పరిశీలించారు. పొద్దుతిరుగుడు పంట, గింజలను శుభ్రం చేసి ఎండబెట్టాలని రైతులకు ఆమె సూచించారు. తేమ 9శాతం రావాలని, మండలంలో 1800 ఎకరాల్లో పంట సాగు చేశారని తెలిపారు. అల్లిపూర్‌లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేసి నిల్వలను అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జయంత్‌కుమార్, ఏఈవోలు సిరా, జమీల్, సాత్విక, రైతులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి



మర్మాములలో ఏఐ ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న ఏంఈవో వరదరాజు

మద్దూరు(ధూళిమిట్ట), మార్చి 18: కృత్రిమ మేధ(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) విద్యా విధానంలో సత్ఫలితాలు రానున్నట్లు మండల విద్యాధికారి వరదరాజు అన్నారు. మంగళవారం మద్దూరు మండలంలోని మర్మాముల ప్రాథమికోన్నత పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వెనుకబడిన విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం భాస్కర్, ఉపాధ్యాయురాలు వనజ, సీఆర్పీ కొరిగింజ శేఖర్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తైబజారు, పశువుల సంతలకు వేలం

దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న పశువుల సంత వేలం

దుబ్బాక, మార్చి 18: దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో తైబజారు, పశువుల సంతలకు వేలం నిర్వహించారు. తైబజారును దుబ్బాకకు చెందిన సుధాకర్‌రెడ్డి రూ.11,11,200లకు వేలం పాట పాడి దక్కించుకున్నాడు. గతేడాది రూ. 11,10,500 ఉండగా, ఈసంవత్సరం కేవలం రూ. 700లు అధికంగా వచ్చింది. పశువుల సంతకు 8 మంది టెండర్లు వేసి వేలం పాటలో పాల్గొన్నారు. గతేడాది పశువుల సంతకు రూ.19.60 లక్షల ఆదాయం రాగా ఈ సారి నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లికి చెందిన వెంకటేశ్వర్లు రూ.28.03 లక్షల పాట పాడి పశువుల సంతను దక్కించుకున్నాడు. వేలం పాటలో సంతలు దక్కించుకున్న టెండరుదారులు ముందుగా 50శాతం డబ్బులు మున్సిపల్‌కు చెల్లించి, సంత నిర్వాహణ కొనసాగించాల్సి ఉంటుందని ఆయన తెలిపారు.

బీఆర్ఎస్వీ నేతల ముందస్తు అరెస్ట్

అక్కన్నపేట: పోలీసుల అదుపులో బీఆర్ఎస్వీ నాయకులు

నంగునూరు: రాజగోపాల్‌పేట పీఎస్‌లో బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట: సిద్దిపేట పట్టణ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం అధ్యక్షుడు మహిపాల్‌గౌడ్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థుల అక్రమ అరెస్టులు నిరసిస్తూ మంగళవారం అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన బీఆర్ఎస్వీ నాయకులను జిల్లా వ్యాప్తంగా ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ... కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు.

-సిద్దిపేట జిల్లానెట్‌వర్క్, నమస్తే తెలంగాణ, మార్చి 18

కొమురవెల్లి: పీఎస్‌లో బీఆర్ఎస్వీ నాయకులు

చేర్యాల: చేర్యాల పీఎస్‌లో బీఆర్ఎస్వీ నాయకులు

చిన్నకోడూర్: బీఆర్ఎస్వీ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

బెజ్జంకి: పీఎస్‌లో బీఆర్ఎస్వీ నాయకులు

ఎల్ ఆర్ఎస్‌పై అవగాహన

చేర్యాలలో అవగాహన కల్పిస్తున్న నోడల్ అధికారి శ్రీలత

చేర్యాల, మార్చి 18: పట్టణంలోని సబ్ రి జిస్ట్రార్ కార్యాలయంలో మంగళవారం ఎల్ఆర్ఎస్‌పై అధికారులు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్స్‌కు నోడల్ అధికారి గుంట శ్రీలత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సబ్ రిజిస్ట్రార్, కార్యాలయ సిబ్బంది ఎల్ఆర్ఎస్ అమలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన పనులను నోడల్ అధికారి వివరించారు. కార్యాలయ అధికారులు, సిబ్బంది ఎల్ఆర్ఎస్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సబ్ రిజిస్ట్రార్ మనోహర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు

గజ్వేల్, మార్చి 18: ఆర్టీసీ కార్గో లాజిస్టిక్స్ ద్వారా భక్తుల ఇంటికే భద్రాద్రి తలంబ్రాలు చేర్చడం జరుగుతుందని జీపీపీ డీఎం పవన్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన భక్తులు గజ్వేల్ ఆర్టీసీ బస్టాండ్‌లోని కార్గో లాజిస్టిక్స్ కార్యాలయంలో రూ.151 చెల్లించి బుకింగ్ చేసుకోవాలన్నారు. బుకింగ్ చేసుకున్న భక్తులకు కల్యాణం అనంతరం తలంబ్రాలను ఇంటి వద్దకే చేర్చుతామన్నారు. భక్తులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గజ్వేల్, మార్చి 18: జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల బాలుర, బాలికల పాఠశాలల్లో 6, 7, 8, 9 తరగతుల్లో బ్యాక్‌లాగ్ సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా డీసీవో మహదేవుని శివప్రసాద్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఈనెల 31లోపు దరఖాస్తులు చేసుకోవాలని, ఏప్రిల్ 20న ప్రవేశపరీక్ష ఉంటుందన్నారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

గజ్వేల్, మార్చి 18: విద్యార్థులు అన్ని అంశాలపై నైపుణ్యాలు పెంపొందించుకోవాలని, అప్పుడే అన్నింటిపై పట్టు ఉంటుందని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనితాఅబ్రహం అన్నారు. మంగళవారం అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని(పై డే) పురస్కరించుకొని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గణితాన్ని అర్థం చేసుకుంటే అన్నింటి కంటే సులభంగా ఉంటుందన్నారు. విద్యార్థులు గణితంపై ప్రజంటేషన్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ సరోజ, డాక్టర్ శ్రీలత పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

వర్గల్, మార్చి18: మండలంలోని నెంటూర్‌లో నీరడి ఎల్లయ్య కొన్ని నెలల క్రితం మృతి చెందాడు. మంగళవారం మాజీ ఎంపీటీసీ శ్యామలాసాదుల్లాగౌడ్ , బీఆర్ఎస్ గ్రామకమిటీ అధ్యక్షుడు కిచ్చుగారి కనుకరాజు, మాజీ సర్పంచ్ లక్ష్మారెడ్డి, విద్యాకమిటీ మాజీ మండల చైర్మన్ రాఘవ రెడ్డి,బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు లింగకిష్టయ్య మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించి రూ.36 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేశారు.

21న పశువుల అంగడి వేలం

హుస్నాబాద్‌టౌన్, మార్చి 18: హుస్నాబాద్ పశువుల అంగడి వేలం పాటను ఈనెల 21న నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్‌గౌడ్ ప్రకటనలో తెలిపారు. పశువుల అంగడివేలంలో పాల్గొనేవారు ఈనెల 20న సాయంత్రం ఐదు గంటలలోపు రూ. 10లక్షల డిపాజిట్‌తో పాటు ఐదువేల రుసుం చెల్లించాలని కోరారు. పురపాలక సంఘం నియమ నిబంధనల ప్రకారం వేలం పాట నిర్వహిస్తామని తెలిపారు.

బావిలో పడి రైతుకు గాయాలు

చేర్యాల, మార్చి 18: మండలంలోని ముస్త్యాలకు చెందిన చిగురు రాజయ్య అనే రైతు బావిలో జారిపడి తీవ్రంగా గాయపడ్డ ఘటన మంగళవారం చోటు చేసుకుంది. రాజయ్య తనకున్న రెండున్నర ఎకరాలలో వ్యవసాయం చేసుకోవడమే కాకుండా మరొకరి భూమిని కౌలుకు తీసుకుని సాగు చేశాడు. ఈ వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న మోటర్ మరమ్మతుకు రాగా, ఆ మోటర్‌ను తీసుకువెళ్లేందుకు బావిల